క్లుప్తంగా

20న మండల సర్వసభ్య సమావేశం

పరవాడ: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 20న నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని ఎంపీడీవో వి.హేమసుందర్రావు చెప్పారు. ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

మూడో విడత వైఎస్సార్ ఆసరా విడుదల చేయాలి

పరవాడ: డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత తక్షణమే విడుదల చేయాలని ఐద్వా అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఏప్రిల్ 5 కల్లా పొదుపు సంఘాలకు మూడో విడత సాయం జమ అవుతుందని ఆశించిన మహిళలకు నిరాశే మిగిలిందన్నారు. డ్వాక్రా గ్రూపులకు తక్షణమే వైఎస్సార్ ఆసరా జమ చేయడానికి చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు.

నష్ట పరిహారం చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెక్కు అందజేస్తున్న సర్పంచ్ సుజాతముత్యాలు

పరవాడ: ముత్యాలమ్మపాలెం శివారు జాలరిపేటకు చెందిన నొల్లి జోగన్న ఇటీవల ప్రమాదవశాత్తు సముద్రంలో పడి మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల నష్టపరిహారం ప్రకటించింది. ముందుగా మంజూరు చేసిన రూ.5లక్షల నష్టపరిహారాన్ని చెక్ రూపంలో సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు ఎం.అప్పన్న, పంచాయతీ కార్యదర్శి సోమునాయుడు, నాయకులు సూరాడ ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



కోట మౌనిక

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక యువతి అదృశ్యంపై ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కప్పరాడ దరి రామ్‌నగర్‌కు చెందిన కోట మౌనిక ఒక కళాశాలలో చదువు కుంటూ తల్లిదండ్రులతో నివసిస్తోంది. ఈ నెల 15న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు చుట్టుపక్కల ఎంత వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో యువతి తల్లి కోట సూర్యకుమారి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఎస్.విజయకుమార్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తున్నారు. కోట మౌనిక ఆచూకీ తెలిసిన వారు డయల్ 100కి తెలియజేయాలని పోలీసులు కోరుతున్నారు.

జూన్ 30కి పూర్తి చేయండి



టౌన్ ప్లానింగ్ సిబ్బందికి సూచనలిస్తున్న ఏసీపీ వెంకటేశ్వరరావు

సీతమ్మధార: భవనాలు, లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకాల(బీపీఎస్, ఎల్ఆర్ఎస్) పెండింగ్ దరఖాస్తులను జూన్ 30 నాటికి పూర్తి చేయాలని జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఆశీలమెట్టలోని జోన్-3 కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయమై ప్రభుత్వం ఆఖరి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. టౌన్ ప్లానింగ్ స్టాఫ్‌కు పలు సూచనలించారు. కార్యక్రమంలో టీపీవో వినయ్‌ప్రసాద్, టీపీఎస్ తేజ, టీపీబీవో అనిత, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

లారీ యజమానుల నిరసన

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన రోడ్ ట్యాక్స్ (క్వార్టర్లీ ట్యాక్స్)ను వెంటనే రద్దు చేయాలంటూ విశాఖ లారీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శీలానగర్ లారీ యార్డ్‌లో బుధవారం నిరసన చేపట్టారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కేవీఎస్ మూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 31 ప్రకారం రవాణా వాహనాల రోడ్‌ట్యాక్స్‌ను 28 శాతం పెంచడం దారుణమన్నారు. పెద్దమొత్తంలో పెంచి అమలు చేస్తున్న గ్రీన్ ట్యాక్స్ రుసుము తగ్గించాలని ఆయన కోరారు. సంక్షోభంలో ఉన్న రవాణా రంగాన్ని రక్షించాలన్నారు. తమ డిమాండ్‌పై పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. అధ్యక్షుడు ఎం.బాపిరాజు, కార్యదర్శి పి.వెంకటరాజు, కోశాధికారి కె.కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

ఈ ఏడాది వేసవి విజ్ఞాన శిబిరాలు ఉల్లాసంగా సాగుతున్నాయి. ఇంట్లో టీవీలు, మొబైల్స్‌కు అతుక్కుపోకుండా చిన్నారుల అభిరుచులకు తగ్గట్టుగా నీతికథలు, కల్పిత కథల నుంచి వచ్చే ఊహాశక్తిని పెంపొందిస్తున్నారు. ప్రకృతి, సమాజం పట్ల ఆసక్తి పెంచుతూ అందుకు అనుగుణంగా చక్కని చిత్రాలు గీయడంపై తర్ఫీదు ఇస్తున్నారు. ఆటలు ఆడిస్తూ స్నేహబంధంతో పాటు క్రీడా స్ఫూర్తిని నింపుతున్నారు. పాటలు పాడించడం, నేర్పించడం, సంగీతంలో మెలకువలపై అవగాహన కల్పిస్తున్నారు. ఏకపాత్రాభినయంతో చిన్నారుల్లో నటనపై ఆసక్తి పెంపొందిస్తున్నారు. కథల పుస్తకాలు చదివించి ఆ నీతిని పిల్లలే వివరించేలా చేస్తున్నారు.



యోగ సాధనలో విద్యార్థులు

సబ్బవరం: పుస్తక పఠనంతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఎంఈవో ఎస్. అప్పలరాజు అన్నారు. సబ్బవరం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు బుధవారం పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ప్రతిరోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి వి. శిరీష తెలియజేశారు. యోగాసనాలు, సూర్య నమస్కారాలు విద్యార్థులకు నేర్పించారు. ఎంఈవో అప్పలరాజు మాట్లాడుతూ యోగాసనాలతో విద్యార్థులకు శారీరక దారుఢ్యంతో పాటు ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



పుస్తక పఠనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో అప్పలరాజు

ఆంగ్లభాషపై పట్టు అవసరం

సింహాచలం: ఆంగ్లభాషపై విద్యార్థులు పట్టు సాధించాలని గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వర్లు సూచించారు. అడవివరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో బుధవారం విద్యార్థులకు ఆంగ్లభాష ఆవశ్యకత-భాషపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులంతా ఆంగ్లభాషపై పట్టు సాధించాలని తెలియజేశారు. చదవడం, వినడం, ఇతరులతో చర్చించడం ద్వారా ఆంగ్లభాష లో ప్రావీణ్యం సాధించవచ్చన్నారు. గ్రంథాలయ రీడర్స్ ఫోరం అధ్యక్షుడు బి.బి.రాజేంద్రప్రసాద్ గేయాలు, నీతికథలు చెప్పారు. కార్యక్రమంలో కార్మికనేత జి.సూర్యనారాయణరాజు, గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం, ఉద్యోగి యల్లమ్మ, పాఠకులు భానుమూర్తి, బి.సూర్యమోహన్, పి.లక్ష్మణ్, ఎం.అజయ్, జి.వరలక్ష్మి, కె.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

ఎంపీడీవో హేమసుందర్రావు



ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీడీవో హేమసుందర్రావు

పరవాడ: జాతీయ ఉపాధి హామీ పథకం పనులు పరవాడ మండలంలో ముమ్మరంగా సాగుతున్నాయని ఎంపీడీవో వి.హేమసుందర్రావు చెప్పారు. మండలంలోని పరవాడ, వెన్నలపాలెం, గొర్లివానిపాలెం చెరువుల్లో చేపట్టిన ఉపాధి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకొన్నారు. ఉపాధి పనుల్లో భాగంగా చెరువు గట్లను బలపర్చడం, కాలువల అభివృద్ధి, మట్టి రోడ్ల నిర్మాణం, ట్రెంచ్, రింగ్ ట్రెంచ్ పనులతో పాటు డైవర్షన్ డ్రైన్‌లు, ల్యాండ్ అభివృద్ధి వంటి పనుల్లో అన్ని వర్గాల నుంచి 2070 మంది కూలీలు పాల్గొన్నారని చెప్పారు. ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు మాత్రమే ఉపాది పనులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రోజుకు రూ.272 వేతనం చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో హేమసుందర్రావు తెలిపారు. ఆయన ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో భాగ్యలత ఉన్నారు.

కల్యాణం.. కమనీయం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఎల్లవేళలా పరిశుభ్రంగా వార్డులు

- యుద్ధప్రాతిపదికన వ్యర్థాల తరలింపు
- జెడ్సీలకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం



పీ అండ్ టీ కాలనీలో పర్యటిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

సీతమ్మధార: వార్డుల్లో చెత్త కుప్పల నిల్వలు లేకుండా యుద్ధప్రాతిపదికన డంపింగ్ యార్డుకు తరలించాలని జోనల్ కమిషనర్లను జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. సీతమ్మధార, పీ అండ్ టీ కాలనీ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులోని డంపర్ బిన్ల చుట్టూ వ్యర్థాలు పేరుకుపోతున్నాయని, వాటిని వెంటనే తొలగించాలన్నారు. డోర్ టూ డోర్ చెత్త సేకరిస్తున్నప్పుడు డస్ట్ బిన్లలోకి ఎలా చేరుతోందని ఆరా తీశారు. పారిశుధ్య కార్యక్రమాల్లో పుష్ కార్ట్ ద్వారా చెత్తను నేరుగా క్లాప్ వాహనానికి అందించేలా చూడాలని సూచించారు. సచివాలయం పరిధిలో శానిటరీ కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి వార్డులో వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. సీన్ పాయింట్ వారీగా పారిశుధ్య కార్మికులను సర్దుబాటు చేసుకొని రోడ్లు, కాలువలను శుభ్రపరచాలని సూచించారు. స్థానిక మయూరి కల్యాణ మండపం పక్క వీధిలో చెత్త ఎక్కువగా పేరుకుపోవడంతో దానిని వెంటనే పారిశుధ్య కార్మికులచే ఎత్తించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలని ఆదేశించారు. అక్కయ్యపాలెం–దొండపర్తి ప్రధాన రహదారిని ఉదయం 6 గంటల నుంచి కార్మికులచే శుభ్రం చేయించాలని కమిషనర్ ఆదేశించారు. బీచ్ రోడ్డులోని సాగర్‌నగర్, రుషికొండ వరకు పర్యటించి జంక్షన్ల అభివృద్ధి, సుందరీకరణ పనులు ఏవిధంగా చేస్తే బాగుంటుందని పరిశీలించారు. సాగర్‌నగర్‌లో మరుగుదొడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పర్యటనలో జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్లు రవికృష్ణరాజు, చీఫ్ సిటీ ప్లానర్ బి.సురేష్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ కె.వి.ఎస్.రవి, కార్యనిర్వాహక ఇంజినీర్ మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు.

చలి వేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సుజాతముత్యాలు

పరవాడ: చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ సుజాత ముత్యాలు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు మైలపల్లి అప్పన్న, పంచాయతీ కార్యదర్శి సోమునాయుడు, మాజీ కోఆపరేటివ్ డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, పూజారి ముత్యాలు, సచివాలయ ఉద్యోగులు రాంకుమార్, దిలీప్‌కుమార్, కృష్ణ, వలంటీర్లు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



ఎస్‌కే చిన్న సాహెబ్ (ఫైల్)

పీఎం పాలెం: తుమ్మిరిగెడ్డ మినీ రిజర్వాయర్‌లో మంగళవారం మధ్యాహ్నం ఈతకు దిగి గల్లంతైన షేక్ చిన్న సాహెబ్ (30) మృతదేహాన్ని పీఎంపాలెం పోలీసులు బుధవారం ఉదయం గుర్తించారు. పీఎం పాలెం ముస్లిం కాలనీలో భార్య బీబీ, నలుగురు పిల్లలతో షేక్ చిన్న సాహెబ్ నివసిస్తుండేవాడు. మధురవాడలోని మటన్ దుకాణంలో రోజు వారీ కూలీగా పని చేస్తుంటాడు. అతని మృతితో భార్య, ముగ్గురు పిల్లలు దిక్కులేని వారయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి అతని భార్య బీబీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అవసరం మేరకే వినియోగిస్తే విద్యుత్ ఆదా

- డీఈఈ పోలాకి శ్రీనివాసరావు

మధురవాడ: వేసవి ఎండలు విపరీతంగా మండిపోతున్న నేపథ్యంలో వినియోగదారులు విద్యుత్ పొదుపు పాటించడం చాలా అవసరమని విశాఖ జోన్ – 3 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కొద్ది రోజులుగా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందన్నారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం చాలా చోట్ల సరిపోవడం లేదని, ఓవర్ లోడ్ అవుతున్నాయని చెప్పారు. అవసరం మేరకే విద్యుత్ వినియోగించాలని, ఏసీలు వంటివి తప్పనిసరి అయితేనే వాడాలని సూచించారు. అవసరం తీరిపోయిన వెంటనే ఫ్యాన్‌లు, లైట్లు ఆపేయడం వల్ల కరెంటు బిల్లు తగ్గడంతో పాటు, విద్యుత్ కూడా ఆదా అవుతుందన్నారు. వినియోగదారుల సహకారం ప్రస్తుతం చాలా అవసరమన్నారు. సరఫరాలో ఏదైనా సమస్య తలెత్తితే తక్షణమే తెలియజేస్తే చర్యలు చేపడతామని తెలిపారు.

11 గంటల్లోపే నిర్వహణ పనులు

ఎండ వేడిమి తక్కువ ఉన్న సమయంలో ముఖ్యంగా ఉదయం 6 గంటల నుంచి 11 మధ్యనే నిర్వహణ, అత్యవసర మరమ్మతులు చేపట్టాలని కింది స్థాయి అధికారులు, సిబ్బందిని డీఈఈ పోలాకి శ్రీనివాసరావు ఆదేశించారు. సిబ్బందిని సబ్ స్టేషన్లలో అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. సమస్య వచ్చిన వెంటనే చర్యలు చేపట్టేలా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మధురవాడ ప్రాంతంలో పెరుగుతున్న జనాభా, అవసరాలు నేపథ్యంలో మరింత నాణ్యమైన విద్యుత్ ప్రజలకు అందించాలంటే మరొక సబ్ స్టేషన్ అవసరం ఉందని చెప్పారు. దీని కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు. వారి ఆమోదం లభించిన వెంటనే సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.

23న జీవీఎంసీ జోన్-4 దుకాణాలకు వేలం

అల్లిపురం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ 4వ జోన్‌కు సంబంధించిన దుకాణాలు, కళ్యాణ మండపాలు, క్యాంటీన్‌కు 23వ తేదీ ఉదయం 11 గంటలకు 4వ జోన్ కార్యాలయంలో బహిరంగ వేలం వేయనున్నట్లు జోనల్ కమిషనర్ శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు నిర్ణీత తేదీలో జోనల్ కార్యాలయంలో జరుగు వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు. పూర్తి వివరాలకు జోనల్ కార్యాలయం పనివేళల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు పర్యవేక్షణ అధికారిని సంప్రదించాలని తెలిపారు.

హజ్ యాత్రికులకు జగనన్న ఆర్థికసాయంపై హర్షం

డాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ హజ్ యాత్రికులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ఆర్థిక సాయం హర్షించదగ్గ విషయమని యాసీన్ హజ్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి రహ్మతుల్లా బేగ్, అధ్యక్షుడు మహ్మద్ అహ్మదుల్లా ఖాన్ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సంవత్సరం విజయవాడ గన్నవరం నుంచి హజ్‌కు వెళ్లే యాత్రికులకు సెంట్రల్ హజ్ కమిటీ రూ.3 లక్షల 88 వేల 580 చెల్లించాలని, హైదరాబాద్ నుంచి హజ్‌కు వెళ్లే యాత్రికులకు రూ.3 లక్షల 5 వేల 173 చెల్లించాలని నిర్ణయించిందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణాకు మధ్య వ్యత్యాసం రూ.83 వేల 407 ఉండడం వల్ల ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌసుల్ అజామ్ ఢిల్లీ వెళ్లి కేంద్ర పౌర విమాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను, కేంద్ర మైనార్టీ శాఖ మంత్రి స్మృతి ఇరానీతో సమావేశమై విజయవాడ గన్నవరం నుంచి వెళ్లే హజ్ యాత్రికులకు రూ.83 వేల 407 తేడా ఉండడం వల్ల ఆ ఖరీదును తగ్గించాలని వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కానీ అటు నుంచి ఎటువంటి జవాబు రాకపోవడంతో సీఎ వైఎస్ జగన్ కలుగజేసుకుని గన్నవరం నుంచి వెళ్లే యాత్రికులకు రూ.80 వేలు చొప్పున 1,814 మంది హాజీలకు నేరుగా వారి ఖాతాల్లో జమ చేసి ముస్లిం మైనార్టీల పక్షపాతిగా నిరూపించుకున్నారని కొనియాడారు. సమావేశంలో జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ షరీఫ్, ఎంఏ రజాక్, ఎస్ బాషా, షేక్ హరూన్ పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

అప్పికొండ ఆలయ అభివృద్ధికి వినతి



దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణతో ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను కోరారు. విజయవాడలో బుధవారం ఆయన్ను కలిసి, ఆలయ ప్రాశస్త్యం గురించి వివరించారు. పురాతనమైన ఆలయంలో మండపం నిర్మించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, శివకుమార్, నజీర్, పెందుర్తి పీఏసీఎస్ డైరెక్టర్ గోవింద్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాంబాబు ఉన్నారు.

జాబ్ కార్డుదారులందరికీ ఉపాధి



గొల్లపాలెంలో ఉపాధి కూలీలకు మంచినీరు అందజేస్తున్న పీడీ సందీప్

డ్వామా పీడీ సందీప్

సబ్బవరం: జాబ్ కార్డు ఉన్న వారందరికీ ఉపాధి పని కల్పించాలని డ్వామా పీడీ ఈ. సందీప్ ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం పీడీ సందీప్ పర్యటించారు. గొల్లలపాలెం, అసకపల్లి, పైడివాడ అగ్రహారం గ్రామాల్లో పని ప్రదేశాల్లో కల్పించిన వసతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా ఓ ఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. మండలంలో చెరువు గట్లు బలపరచడం, కాలువల అభివృద్ధి, వరద కట్టలు, మట్టి రోడ్లు నిర్మాణం, ట్రెంచ్ పనులు, ఫామ్ పాండ్స్, డైవర్షన్ డ్రెయిన్లు వంటి పనుల్లో 5704 మంది వేతనదారులు పని చేస్తున్నారని చెప్పారు. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఉదయం 5 గంటలకు వచ్చి 10 గంటలకు పని పూర్తి చేసుకొని ఇంటికి వెళ్లాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్స్‌తో పాటు ఫస్ట్ ఎయిడ్ కిట్స్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సరాసరి వేతనం రోజుకు రూ. 272 గిట్టుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అడిషినల్ ప్రోగ్రాం ఆఫీసర్ మళ్ల శ్రీనివాసరావు, ఎంపీడీవో రమేష్‌నాయుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



మొక్క నాటుతున్న కార్పొరేటర్ వసంత, జెడ్సీ మల్లయ్యనాయుడు

సింహాచలం: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కంకణం కట్టుకోవాలని 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత పిలుపునిచ్చారు. వార్డు పరిధి చినముషిడివాడ జంక్షన్‌లో బుధవారం స్వచ్ఛసర్వేక్షణ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జెడ్సీ మల్లయ్యనాయుడు, ఇతర అధికారులతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తెలిపారు. జెడ్సీ మల్లయ్యనాయుడు మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని కోరారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని పిలుపునిచ్చారు. తడి-పొడి-ప్రమాదకరమైన చెత్తలను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు పారిశుధ్య కార్మికులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో శానాపతి శంకరరావు, ఏఈ రాజశేఖర్, ఏంహెచ్‌వో కృష్ణంరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి రహిత నగరానికి సహకారం



ప్రచారం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార: గంజాయి రహిత నగరానికి ఆటో డ్రైవర్లు సహకరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జి.వామనమూర్తి, జిల్లా సమితి సభ్యుడు పడాల గోవింద్ కోరారు. సీతమ్మధారలో బుధవారం ఆటో డ్రైవర్ల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంత విశాఖలో యువతీ, యువకుల ప్రాణాలతో చెలగాటమాడే గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల నియంత్రణకు పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ ధరలు రద్దు చేయాలని, ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. పోలీసులు, ఆర్టీవో అధికారులు వేస్తున్న ఈ-చలానాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రావికృష్ణ, హరి, రాజు, రమణ, ప్రసాద్, ముత్యాలనాయుడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఎంపీపీ రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు, ఉపాధ్యాయులు

పద్మనాభం: 'నాడు – నేడు' పథకంతో ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మౌలిక సౌకర్యాలు కల్పించడంతో విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపి పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచారని ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు అన్నారు. పదో తరగతి ఫలితాల్లో 500కు పైగా మార్కులు సాధించిన 45 మంది విద్యార్థులను మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఘనంగా సత్కరించి మెమెంటోలు అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు లేవన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం జగన్ సౌకర్యాలు కల్పించి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించిన 45 మంది 500కు పైగా మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. ఇతర విద్యార్థులు వీరిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ప్రతిభ చూపిన విద్యార్థుల ఫొటోలతో ఫ్లెక్సీలను అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయాల్లో పెట్టాలన్నారు.